# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..


https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 165 1-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06









## ఏముందో అదే చెబుతా...

# చెప్పిందే చేస్తా

- ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే నా రాజకీయ జీవితం: సీఎం రేవంత్
- బెల్టు షాపులు తప్ప కేసీఆర్ పాలనలో వచ్చినవేమీ లేవు
- కూలిన 'కాళేశ్వరం' నుంచి చుక్క నీరు తీసుకోకున్నా పంటలు పండాయి
- వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ తెచ్చి బిల్లులు మాఫీ చేశారు
- రైతు భరోసా ఖరీఫ్ నిధుల విడుదల సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- భవిష్యత్తులో పంట వేసిన రైతులకే భరోసా: మంత్రి తుమ్మల

హైదరాబాద్: 'అధికారం కోసం అబద్ధాలు చెప్పను. ఏముందో అదే చెబుతా... చెప్పిందే చేస్తా. అబద్ధాల పునాదులపై ప్రభుత్వం నడపను. ఈ ప్రభుత్వం రైతులది, పేదలది, మహిళలది, నిరుద్యోగులది. పదవి శాశ్వతం కాదు... మాట శాశ్వ తం. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే నా రాజకీయ జీవితం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రైతు భరోసా పథకం కింద ఖరీఫ్ పెట్టుబడి సాయం విడుదల సందర్భంగా నిర్వహించిన

- మిగతా 2వ పేజీలో

## త్రిలింగ భూమిపై కమలం వికసించాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడాలి
- తెలంగాణలో కాంగ్రెస్ సర్కారుకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది
- ఇంటింటికీ వెళ్లి వికసిత్ భారత్ లక్ష్యాలను వివరించాలి
- ప్రజల గొంతుకగా రోడ్డెక్కితేనే మనకు అధికారం సాధ్యం
- శ్రేణులకు నితిన్ నబీన్ దిశానిర్దేశం



2లో



## ఏపీలో కనెక్టివిటీ కష్టాలకు చెక్..

- సర్వీస్ ప్రొవైడర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఏపీలో సమాచార నెట్‌వర్క్‌పై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- మారుమూల ప్రాంతాల్లోనూ కనెక్టివిటీకి చర్యలు చేపట్టాలని ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2310 సెల్ టవర్ల ఏర్పాటుకు ప్రణాళిక
- మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ అక్షరాస్యత పెంచాలని సూచన
- కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా పూర్తి మొబైల్ కవరేజీకి నిర్ణయం

ఆంధ్రప్రదేశ్‌లో సమాచార, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసి, మారుమూల గ్రామాలకు సైతం కనెక్టివిటీ అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సమాచార నెట్‌వర్క్ విషయంలో ఏపీని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ దిశగా రాష్ట్రంలోని కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై ఆయన ఉన్నతాధికారులు, వివిధ సర్వీస్ ప్రొవైడర్లతో అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మొబైల్ కవరేజి విషయంలో సర్వీస్ ప్రొవైడర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, భౌగోళికంగా కవరేజి లేని మారుమూల ప్రాంతాల్లోనూ సెల్ టవర్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30,694 సెల్ టవర్లు ఉండగా, అదనంగా మరో 2310 టవర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ, కమ్యూనికేషన్


- మిగతా 2వ పేజీలో

## 'పుట్టుకతో పౌరసత్వం' సబబే

- ఈ దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరూ ఇక్కడి పౌరులే
- అమెరికా సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
- ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు కొట్టివేత
- అది రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం స్పష్టీకరణ
- అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు భారీ ఊరట



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసల విధానానికి దేశ అత్యున్నత న్యాయస్థానంలో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు భారీ ఊరట లభించింది. అమెరికా గడ్డపై జన్మించినవారికి



## సులభతర జీవనం.. వాణిజ్యం

- వీటి లక్ష్యసాధన కోసం నిబంధనలను సడలిద్దాం.. సంస్కరణలు తెద్దాం
- ప్రభుత్వంలోని కీలక శాఖల కార్యదర్శులకు మోదీ ఉద్బోధ
- ఈ దిశగా చేపడుతున్నచర్యల పురోగతిపై సమీక్ష
- మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాల వేళ భేటీపై సర్వత్రా ఆసక్తి

న్యూఢిల్లీ: దేశంలో సులభతర వాణిజ్యం, ప్రజల సౌకర్యవంతమైన జీవనానికి బాటలు పరిచేలా నిబంధనల సడలింపుతోపాటు ఆ మేరకు సంస్కరణలు తీసుకురావాలని ప్రధాని మోదీ ఉపదేశించారు. సెషెల్స్ దేశ పర్యటన ముగించుకుని వచ్చిన మరుసటి రోజే మోదీ అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులతో

- మిగతా 2వ పేజీలో

## రాష్ట్రపతి జీవితమే స్ఫూర్తి..

- ఆమె ఎదుర్కొన్న దుఃఖాన్ని మనం ఊహించలేం
- విశాఖ గిరిజన వర్సిటీ స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితమే గొప్ప స్ఫూర్తి అని వ్యాఖ్య
- సాధారణ గిరిజన గ్రామం నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని కొనియాడారు
- చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు
- యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ గతిని మార్చాలని పిలుపు

2లో




## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు

- సిగాచి పరిశ్రమలో 54 మంది కార్మికులు సజీవదహనమైన ఘటనను గుర్తు చేసుకున్న హరీశ్
- 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా రేవంత్ రెడ్డి రాలేదని విమర్శ
- మృతి చెందిన కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దని వ్యాఖ్య

2లో

## తిరుమలకు పోటెత్తిన భక్తులు...

- తిరుమల శ్రీవారికి నిన్న రూ.5.63 కోట్ల హుండీ ఆదాయం
- స్వామివారిని దర్శించుకున్న 95,498 మంది భక్తులు
- సర్వదర్శనానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం
- 21 కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం వేచి ఉన్న యాత్రికులు
- నిన్న ఒక్కరోజే 4.34 లక్షల లడ్డూల విక్రయం



తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం లభించింది. సోమవారం ఒక్కరోజే శ్రీవారి హుండీకి రూ. 5.63 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.



## రగిలిన రైతన్న

- రాష్ట్రం నలుమూల నుంచి పోటెత్తిన రైతన్నలు
- సీఎం డౌన్ డౌన్.. అంటూ నినాదాలు
- ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదంటూ ఆవేదన
- పెట్టుబడి సాయం ఎగ్గొట్టారంటూ కౌలు రైతుల కన్నీళ్లు
- ధర్నా చౌక్ నుంచి సీఎం క్యాంపు కార్యాలయానికి భారీ ర్యాలీ
- బారికేడ్లను తోసుకుంటూ చల్లపల్లి బంగ్లా వైపు అన్నదాతల భారీ ర్యాలీ

అమరావతి: రాష్ట్రంలో రెండేళ్లుగా ఏ ఒక్క పంటకూ మద్దతు ధర దక్కకపోవడం.. సీజన్‌లో యూరియా, విత్తనాలు అందించకుండా యాప్ పేరుతో ఇక్కట్లకు గురి చేయడం.. కౌలు రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం.. ఉచిత పంటల బీమాను ఎగరగొట్టడం.. సున్నా వడ్డీ రాయితీ పథకం డబ్బులివ్వకుండా రెండేళ్లుగా తొక్కిపెట్టటాన్ని నిరసిస్తూ రైతన్నలు

# తిరుమలకు పోటెత్తిన భక్తులు...

(మొదటి పేజీ తరువాయి)

నిన్న శ్రీవారిని మొత్తం 95,498 మంది భక్తులు దర్శించుకున్నారు. తిరుమల గిరులపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రస్తుతం 21 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని టీటీడీ తెలిపింది. వారాంతం ముగిసినా రద్దీ తగ్గకపోవడంతో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం నాడు 30,231 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకున్నారు. టీటీడీ నిన్న మొత్తం 4.34 లక్షల లడ్డూ ప్రసాదాలను విక్రయించింది. అదేవిధంగా, 2.58 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించగా, 3,172 మందికి వైద్య సేవలు అందజేశారు.

# ఏపీలో కనెక్టివిటీ కష్టాలకు చెక్..

(మొదటి పేజీ తరువాయి)

శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, అవసరమైన టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి సర్వీస్ ప్రొవైడర్లకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వీలైతే వంద రోజుల వ్యవధిలో ఈ టవర్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కేవలం నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు కూడా సర్వీస్ ప్రొవైడర్లు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం అందిస్తున్న వాట్సప్ గవర్నెన్స్ 'మనమిత్ర', సంజీవని వంటి సేవలను ప్రజలు సమర్థంగా వినియోగించుకోవడానికి ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు డిజిటల్ అక్షరాస్యులైతే, మొబైల్ ఫోన్ ద్వారానే మరిన్ని ప్రభుత్వ సేవలను సులభంగా పొందగలరని వివరించారు. త్వరలో ఏఐ అగ్రానమిస్ట్, ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ వంటి వినూత్న సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాతిపదికన అన్ని ప్రాంతాలకూ పూర్తి మొబైల్ కవరేజీ అందిస్తున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతిలో ఎక్కడా తవ్వకాలు జరపకుండా, ప్రతి ఇంటికీ ఫైబర్ ద్వారానే సమాచార నెట్‌వర్క్ అందించే ప్రణాళికను వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,69,638 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌తో పాటు 28.67 లక్షల బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, టెలికమ్యూనికేషన్స్ విభాగం అధికారులు, బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్-ఐడియా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు

తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్స్యూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 న్యూకి అనుమతి తీసుకుని 1777 న్యూ నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ చీూజ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు.

# 'పుట్టుకతో పౌరసత్వం' సబబే

పౌరసత్వం ఇవ్వడం సమంజసమేనని అమెరికా సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. 'జన్మతః పౌరసత్వం'వెసులుబాటుకు కళ్లెం వేస్తూ డొనాల్డ్ ట్రంప్ 2025 జనవరిలో జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న వారికి పుట్టిన పిల్లలు అమెరికా పౌరులు కారని తేల్చిచెబుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టింది. జన్మతః పౌరసత్వం విస్తృత భావనను సమర్థించింది. తల్లిదండ్రులు అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా ఉన్నప్పటికీ.. వారికి పుట్టిన పిల్లలకు 14వ రాజ్యాంగ సవరణ అమెరికా పౌరసత్వాన్ని కల్పిస్తోందని సుప్రీంకోర్టు పేర్కొంది. ట్రంప్ ఆర్డర్‌ను నిలిపివేస్తూ దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సుప్రీంకోర్టు 6--3 తీర్పుతో సమర్థించింది. ఈ దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరూ ఇక్కడి పౌరులేనని(చాలా పరిమితమైన మినహాయింపులతో) సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చరిత్రాత్మక తీర్పునిచ్చారు.

అంతర్యుద్ధం తర్వాత ఆమోదించిన 14వ సవరణపై సుదీర్ఘకాలంగా ఉన్న అవగాహనపై, ఇటీవలి ఫెడరల్ చట్టాలపైనా ఆధారపడి ఈ తీర్పును వెలువరించారు. "అప్పుడైనా, ఇప్పుడైనా పౌరసత్వం అంటే హక్కులను కలిగి ఉండే హక్కు. అంటే రాజకీయ సమాజంలో స్వేచ్ఛగా పాలుపంచుకునే హక్కు. 14వ రాజ్యాంగ సవరణను రూపొందించినవారు.

# రాష్ట్రపతి జీవితమే స్ఫూర్తి..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం దేశంలోని ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా గిరిజన యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య అనేది కేవలం డిగ్రీలు ప్రదానం చేసే ప్రక్రియ కాదని, అది తరాల భవిష్యత్తును నిర్దేశించే శక్తి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవిత ప్రస్థానాన్ని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా వివరిస్తూ భావోద్వేగ ప్రసంగం చేశారు. "ఈ విశ్వవిద్యాలయం ఎందుకు ముఖ్యమో చెప్పడానికి మన ప్రియతమ రాష్ట్రపతి జీవితం కంటే గొప్ప ఉదాహరణ లేదు. ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా ఉపర్‌బేడా అనే చిన్న గిరిజన గ్రామంలో పుట్టిన ఆమె, పాఠశాలకు వెళ్లడమే కష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు.

# ఏముందో అదే చెబుతా... చెప్పిందే చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

రైతు భరోసా సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ మళ్లీ వస్తాడని ఇద్దరు పిల్ల రాక్షసులు చెబుతున్నారని.. ఆయన రావడం వల్ల ఆ కుటుంబానికే ఉపయోగం తప్ప ప్రజలకు ఒనగూరేదేముందని సీఎం ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారని.. అయితే బెంగాల్‌లో అధికారంలోకి రావడానికి బీజేపీకి 15 ఏళ్లు పట్టిందని.. ఇక్కడ కూడా అలాగే వేచి ఉండాలని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్య అంశమని చెప్పారు. రైతుల కోసం ప్రతినెలా రూ. 6 వేల కోట్ల చొప్పున గత 30 నెలల్లో రూ. 1.75 లక్షల కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పంటా కాళేశ్వరం నీళ్లతోనే పండుతోందని బీఆర్ఎస్ నేతలు చెప్పుకొనే వాళ్లని.. కానీ మూడేళ్లుగా అక్కడి నుంచి చుక్క నీరు రాకపోయినా తెలంగాణ రైతులు 2 కోట్ల 80 లక్షల టన్నుల ధాన్యం ఎలా పండించారో చెప్పాలని సీఎం ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో వరి పండించి క్వింటా రూ. 4,200కు అమ్ముకున్నాయన వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో అయిన అప్పు రూ. 69 వేల కోట్లు అయితే, పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం రూ. 7 లక్షల కోట్లకుపైగా అప్పు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు కూడా విడతలవారీగా ఇచ్చారని.. బడి పిల్లల భోజన బిల్లులు, యూనిఫాం బిల్లులు, స్వయం సహాయక సంఘాల బకాయిలు, సర్పంచుల బిల్లులు... ఇలా ఏ ఒక్కటీ చెల్లించకుండా వెళ్లిపోయారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు అయిందో లేదో అప్పుడే దిగిపోవాలంటున్నారని.. అడగగానే దిగిపోవడానికి తాము గడీల ముందు బానిసలమా? అని సీఎం ప్రశ్నించారు. 'కేసీఆర్ మళ్లీ వస్తే ప్రజలకు ఏం చేస్తడు. ప్రజలకేం ఇచ్చిండని వస్తడు? మొగుడు పెళ్లాలు మాట్లాడుకునే మాటలు వినడానికా? రైతు బజార్లు తీసుకురావాల్సింది పోయి బెల్టు షాపులు తీసుకొచ్చారు. రాష్ట్రంలో తాగుడు సంస్కృతిని పెంచారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. దళితులకు 3 ఎకరాల చొప్పున భూపంపిణీ ఇవ్వలేదు. రూ. లక్ష చొప్పున రైతులకు రుణమాఫీ చేయలేదు. మేం సంసారాల్లో చిచ్చుపెట్టే తప్పుడు రాజకీయాలు చేయం. ఫోన్ ట్యాపింగ్ లాంటి పనులు మా ప్రభుత్వంలో ఉండవు'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'తెలంగాణలో కూడా మోదీ పాలన వస్తదని బీజేపీ నేతలు అంటున్నారు. అయినా మోదీ వచ్చి మోరీ తీస్తాడా? ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోదీ చెప్పారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ లెక్కన 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు రావాలి. ఎక్కడ ఉన్నాయి ఆ ఉద్యోగాలు? తెలంగాణలో బండి సంజయ్, కిషన్‌రెడ్డికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు'అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్**

'ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్. వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి అధికారంలోకి వచ్చిన రోజే ఉచిత విద్యుత్‌పై సంతకం చేశారు. రూ. 12 వేల కోట్ల విద్యుత్ బిల్లులను కూడా మాఫీ చేశారు. ఎవరైనా ఉచిత విద్యుత్ ఇచ్చామంటే ఉరికించి కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు కూడా ఉచిత విద్యుత్ కోసం గత 30 నెలల్లో రూ. 30 వేల కోట్లు వెచ్చించాం. ప్రతిపక్ష నాయకులు మూసీ అభివృద్ధి వద్దంటారు... మెట్రో వద్దంటారు... రీజనల్ రింగ్ రోడ్ వద్దంటారు... పొర్లు దండాలు పెట్టినా అభివృద్ధి పనులు ఆపం'అని రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.

**పంట మార్పిడి తప్పనిసరి**

ఈసారి వర్షాలు తక్కువగా పడే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నందున వర్షాలను బట్టి రైతులు పంటలు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# త్రిలింగ భూమిపై కమలం వికసించాలి

ఘట్‌కేసర్: తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ముక్త్ తెలంగాణ కల సాకారం చేయాలని పార్టీ నేతలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. ఇందుకోసం వెంటనే సడక్ సే సన్సద్ తక్ (గల్లీ నుంచి చట్టసభల దాకా) పోరుబాటకు శ్రీకారం చుట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ లక్ష్యాలను వివరించాలని సూచించారు. తెలంగాణలో పరివర్తన, ప్రజల గొంతుకగా వారి సమస్యలపై రోడ్లపైకి వచ్చి పోరాడితేనే అధికారం సాధ్యమని.. ఈ త్రిలింగ భూమిపై కమలం వికసించేలా పోరాడాలని కోరారు. మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ అవుషాపూర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నితిన్ నబీన్.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల పాలనను తూర్పారబట్టడంతోపాటు తెలంగాణలో అధికారం చేపట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ పూర్తి చేయలేదని నితిన్ నబీన్ విమర్శించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు పేరిట లూటీకి తలుపులు తెరిచిందని దుయ్యబట్టారు. అవినీతి, నేరమయ రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ పర్యాయపదంగా మారిందని.. దేశంలోని తుక్‌డే తుక్‌డే గ్యాంగ్‌లతో చేతులు కలిపి పనిచేస్తోందన్నారు. తెలంగాణ ప్రజల శ్రమతో సంపాదించిన డబ్బును ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట ఢిల్లీకి తరలిస్తోందని.. ప్రజల డబ్బును, రైతులకు ఇతర వర్గాలకు ఇవ్వాల్సిన సొమ్మును రాహుల్ గాంధీ విదేశీ యాత్రలకు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలాయని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అదే అవినీతి, అక్రమాలను కొనసాగిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఈ లెక్కలన్నీ తేలుస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనని, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంచుతామని ప్రకటించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య, పార్టీ నేతలు సునీల్ బన్సల్, అభయ్ పాటిల్, రేఖా శర్మ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు. 'తెలంగాణలో ఫైర్ ఉన్నా దానిని ఎలా ఉపయోగించుకోవడమే సమస్యగా మారుతోంది. మీలో మీరు కొట్టుకుంటున్నారు. దీంతో అంతర్గత విభేదాలు తీవ్రమవుతున్నాయి. ఈ పరిస్థితిని పక్కనపెట్టి అన్ని శక్తులను ఒకే దిశలో పెట్టే ప్రక్రియ అవసరం 'అని రాష్ట్ర కార్యవర్గ భేటీ ముగింపు సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ పేర్కొన్నట్లు సమాచారం. నేతలంతా టార్గెట్ తెలంగాణ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. 'రాష్ట్రంలో బీజేపీకి మరో శత్రువు లేదు. పార్టీలోనే ఒకరికొకరు శత్రువులు ఉన్నారు. ఇదే పెద్ద సమస్య. దీన్ని అధిగమిస్తే పార్టీ అధికారంలోకి రావడం ఖాయం'అని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

# సులభతర జీవనం.. వాణిజ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయమైన 'సేవా తీర్థ్'లో సమావేశమయ్యారు. సులభతర జీవనం, వాణిజ్యంతోపాటు ఆత్మనిర్భరతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆయా మంత్రిత్వశాఖలు చేపట్టిన కార్యక్రమాలు, ఆయా పథకాల పురోగతిపై కార్యదర్శులు మోదీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రివర్గాన్ని మోదీ పునర్వ్యవస్థీకరించనున్నారని వార్తలు వెలువడుతున్న వేళ ఈ సమీక్ష సమావేశం జరగడంతో దీనికి ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. ప్రధాని దార్శనికత, ఆమేరకు సఫలీకృతమైన విధాన నిర్ణయాలు, ఈ దిశలో కీలక రంగాల వారీగా ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి ఆచరణలో పెట్టిన వ్యూహాల పైనా ఈ సమీక్షా సమావేశంలో చర్చ జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. లక్ష్యాలను వేగంగా సాధించడంలో సమీకృత ప్రణాళిక, సమన్వయం అవసరమని ఆయా మంత్రిత్వశాఖల కార్యదర్శులకు మోదీ సూచించారు. శాఖల మధ్య అంతర్గత సమన్వయంతోపాటు విధానపర నిర్ణయాలు వేగంగా తీసుకునేలా పీఎం 'గతిశక్తి'వేదికను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని మోదీ ఆదేశించారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుచేయడంపై దృష్టిపెట్టాలని ప్రధాని సూచించారు. పరిపాలనా సంస్కరణలు, అభివృద్ధి లక్ష్యాలు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని ప్రోత్సహించడంలో సాధించిన పురోగతిపై సమీక్ష కోసమే ఈ భేటీ నిర్వహించినప్పటికీ మంత్రిత్వ శాఖల పనితీరుపై మోదీ ఈ భేటీలో ఆయా శాఖల కార్యదర్శులను ఆరా తీసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రధాని కార్యాలయం సహా కేబినెట్ మంత్రుల పనితీరుపై కూడా ఆయా ఉన్నతాధికారులు.. సహాయ మంత్రులపై ఫీడ్‌బ్యాక్ ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విడివిడిగా కలిసిన నేపథ్యంలో, ఇప్పుడీ కార్యదర్శుల సమావేశం ముగిసిన వెంటనే త్వరలోనే మంత్రివర్గంలో భారీ మార్పులు ఉండవచ్చనే అంచనాలు బలంగా ఉన్నాయి. అవీ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే ఉంటాయనే ఊహాగానాలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో ఈ మేధోమథన సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. మంత్రిత్వ శాఖల పనితీరును సమీక్షించడం, రాబోయే నెలల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన సంస్కరణలపై అప్రమత్తం చేయడంతో పాటు మంత్రివర్గం, ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశ వివరాలను ఆయా మంత్రిత్వ శాఖలకు కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ ఎప్పటికప్పుడు ఒక నోట్స్ రూపంలో పంపిస్తోంది. మంత్రివర్గం, ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయడంలోనూ, పనితీరు మెరుగుపరుచుకోవడంలోనూ లోపాలు, ఆలస్యం అవుతున్నాయని ఈనెల 17న పంపిన మెమోరాండంలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వికసిత్ భారత్--2047 లక్ష్యంగా ఏయే శాఖలో ఏయే కార్యక్రమాలు ఏవిధంగా జరుగుతున్నాయి, ఫైళ్లు నిర్దిష్ట కాలంలో పరిష్కారమవుతున్నాయా లేదా అనే తదితర అంశాలపై మంగళవారం నాటి సమావేశంలో మోదీ సమీక్ష జరిపినట్లు తెలుస్తోంది.

# రగిలిన రైతన్న

అమరావతి: రాష్ట్రంలో రెండేళ్లుగా ఏ ఒక్క పంటకూ మద్దతు ధర దక్కకపోవడం.. సీజన్‌లో యూరియా, విత్తనాలు అందించకుండా యాప్ పేరుతో ఇక్కట్లకు గురి చేయడం.. కౌలు రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం.. ఉచిత పంటల బీమాను ఎగరగొట్టడం.. సున్నా వడ్డీ రాయితీ పథకం డబ్బులివ్వకుండా రెండేళ్లుగా తొక్కిపెట్టటాన్ని నిరసిస్తూ రైతన్నలు చంద్రబాబు సర్కారుపై కదం తొక్కారు. చంద్రబాబును నమ్మి మోసపోయామని, రైతుల పొట్టగొట్టిన ఈ రాక్షస పాలనను తుదముట్టించేంతవరకు విశ్రమించబోమని గర్జించారు. 'సీఎం డౌన్ డౌన్'... 'రైతు వ్యతిరేక పాలన నశించాలి'.. 'కష్టం రైతులది.. లాభం దళారులదా..!' అంటూ పిడికిళ్లు బిగించారు. బాబు ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన 'చలో విజయవాడ' విజయవంతమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలతో విజయవాడ ధర్నాచౌక్ ప్రాంతం దద్దరిల్లింది. ధర్నాచౌక్ నుంచి సీఎం క్యాంపు కార్యాలయం వైపు దూసుకెళ్లారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అలంకార్ సెంటర్ మీదుగా ఏలూరు రోడ్డు వైపు కదం తొక్కారు. ఎక్కడికక్కడ బారికేడ్లతో పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా రైతన్నలు ఉద్యమ కెరటాల్లా ఎగసిపడ్డారు. అలంకార్ సెంటర్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి మూడు అంచెల బారికేడ్లతో దిగ్బంధించారు. పిడిగుద్దులు, బూటుకాళ్లతో తొక్కుతూ వారిని నిరోధించేందుకు యత్నించారు. పలువురు రైతులను పోలీసులు ఈడ్చేశారు. ధర్నాచౌక్ నుంచి లెనిన్ సెంటర్ వైపు ర్యాలీగా తరలి వెళ్లిన అన్నదాతలను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. బారికేడ్లను తోసుకుంటూ ముందుకు సాగేందుకు యత్నించిన రైతులపై పోలీసులు బల ప్రయోగానికి దిగారు. దాదాపు గంటకుపైగా పోలీసులు, రైతులకు మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసుల దాష్టీకానికి పలువురు రైతులకు కాలి వేళ్లు చితికిపోయి రక్తపు గాయాలయ్యాయి. రక్తమోడుతున్నా లెక్క చేయకుండా కొదమ సింహాల మాదిరిగా బారికేడ్లను తోసుకుంటూ ఏలూరు రోడ్డులోని చల్లపల్లి బంగ్లా వరకు ర్యాలీగా తరలి వెళ్లారు. దారిపొడవునా రైతులను అడ్డగిస్తూ బలవంతంగా ఈడ్చి పారేయగా, మరి కొంత మంది రైతులను పోలీసులు బూటుకాళ్లతో అడ్డగించే యత్నం చేశారు. అలంకార్ సెంటర్‌లో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య బ్యారికేడ్ల పైకి ఎక్కి ఆందోళనకు దిగారు. రైతుల న్యాయమైన డిమాండ్లను వినకుండా ప్రభుత్వం పోలీసు బలగాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పిస్తామని పోలీసు ఉన్నతాధికారులు బుజ్జగించడంతో రైతులు కొద్దిగా శాంతించారు. అంతకుముందు ధర్నాచౌక్ వద్ద 2 గంటల పాటు ధర్నా చేశారు. రైతులు ప్లకార్డులు, డిమాండ్లతో కూడిన బ్యానర్లు చేతబట్టి తలపై ఆకుపచ్చ కండువాలు కట్టుకుని ముందుకు సాగారు. చంద్రబాబు పాలనలో ఏ ఒక్క రైతు కూడా సంతోషంగా లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. ఒక్కరైనా సంతృప్తికరంగా ఉన్నారని నిరూపిస్తే తాము దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు.



## విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

- రేణికుంటలో రైతుకు లక్ష రూపాయల నష్టం
- ఆదుకోవాలని గ్రామస్తుల డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రేణికుంట గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఒక పాడిగేదె మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... రేణికుంటకు చెందిన రైతు దయ్యాల చంద్రయ్య తన పాడి గేదెను మేతకు తీసుకెళ్లగా, సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. మృతి చెందిన గేదె చూడిది కావడం, దాని విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. తనకు జీవనాధారమైన పాడి పశువు మరణించడంతో చంద్రయ్య కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి, బాధితుడికి తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బడి బాగుకు సర్పంచ్ చేదోడు

- హరిజనవాడ పాఠశాల రంగుల కోసం రూ. 32,500 విరాళం
- సొంత వేతనాన్ని అందజేసి ఆదర్శంగా నిలిచిన కోయ మధు



**తొలివెలుగు, రాజాపేట:** స్థానిక హరిజనవాడ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రాజాపేట సర్పంచ్ కోయ మధు తనదైన శైలిలో చేదోడుగా నిలిచారు. పాఠశాల భవనానికి రంగులు (పెయింటింగ్) వేయడం కోసం ఆయన తన సొంత సర్పంచ్ వేతనం నుంచి సమకూరిన రూ. 32,500 నగదును విరాళంగా ప్రకటించి ఆదర్శంగా నిలిచారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మండల విద్యాధికారి (ఎంఈఓ) రమేష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తద్క రాజు సమక్షంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌కు సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యాధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సర్పంచ్ కోయ మధు చొరవ మిగిలిన వారికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని సర్పంచ్ మధు హామీ ఇచ్చారు. తమ పాఠశాల బాగుకోసం నిధులు అందజేసిన సర్పంచ్‌కు ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, వార్డు సభ్యుడు సట్టు రవీందర్, ప్రముఖులు గాండ్ల నర్సింగరావు, చల్మలపల్లి లక్ష్మణ్, సంగెం వేణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పురస్కారం.. హర్షితకు 'నేస్తం' ఆర్థిక సాయం

- బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి ఘన సత్కారం
- పైచదువుల ప్రోత్సాహానికి రూ.5 వేల నగదు బహుకరణ
- దాతల సేవాభావాన్ని అభినందించిన ప్రధానోపాధ్యాయులు

**తొలివెలుగు, రాజాపేట:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని హర్షితకు 'నేస్తం (ఫ్రెండ్స్)' గ్రూప్ సభ్యులు ఆర్థిక ప్రోత్సాహం అందించారు. పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్‌జీయూకేటీ)లో సీటు సాధించిన సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. పైచదువులు కొనసాగించేందుకు ప్రోత్సాహకంగా రూ.5,000 నగదు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తద్క రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రతిభ కనబరుస్తూ ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో వెనుకబడే విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, ఆ దిశగా 'నేస్తం (ఫ్రెండ్స్)' సభ్యులు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. విద్యార్థిని హర్షిత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నేస్తం (ఫ్రెండ్స్) సభ్యులు, విద్యార్థులు పాల్గొని హర్షితను అభినందించారు.



# నిబద్ధతతో పనిచేసే అధికారులే ఆదర్శప్రాయులు



- జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహరావుకు ఘన వీడ్కోలు
- కలెక్టరేట్‌లో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు కాదు.. కొత్త అధ్యాయానికి నాంది



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** ప్రభుత్వ సేవలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించే అధికారులే సమాజానికి ఆదర్శప్రాయులని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహరావు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. నరసింహరావు తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ లబ్ధిదారులకు చేరవేయడంలో విశేష కృషి చేశారని ప్రశంసించారు. సహోద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండేవారని గుర్తుచేశారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నరసింహరావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ శాఖ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. పదవీ విరమణ పొందిన నరసింహరావు మాట్లాడుతూ.. తన ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, ఉన్నతాధికారులకు, సహోద్యోగులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అందరూ చూపిన ప్రేమాభిమానాలను జీవితాంతం గుర్తుంచుకుంటానని భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం నరసింహరావు దంపతులను అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జేఏసీ ప్రతినిధులు, సంక్షేమ శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# ఆదర్శ ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

- లింగోజిగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కూరెళ్ల శ్రీనివాసరావు పదవీ విరమణ మహోత్సవం
- చిత్రకళా ప్రతిభ, క్రమశిక్షణతో విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన గురువు
- శాలువాలు, జ్ఞాపికలతో ఘన సన్మానం.. పలువురు ప్రముఖుల ప్రశంసలు
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ గురువారావు

**తొలివెలుగు, చౌటుప్పల్:** నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచిగా నిలుస్తారని మండల విద్యాధికారి (ఎంఈఓ) గురువారావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూరెళ్ల శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పీఆర్‌టీయూ చౌటుప్పల్ అధ్యక్షుడు కేఆర్ మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ గురువారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని పలువురు ప్రధానోపాధ్యాయులతో పాటు సుమారు 15 మంది పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొని శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గురువారావు మాట్లాడుతూ.. కూరెళ్ల శ్రీనివాసరావు తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో విద్యారంగ అభివృద్ధికి విశేష సేవలందించారని కొనియాడారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలు పెంపొందించడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తికి ఆయన ఆదర్శంగా నిలిచారని, పదవీ విరమణ అనంతరం కూడా విద్యా, సామాజిక సేవల్లో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. శ్రీనివాసరావులోని చిత్రకళా ప్రతిభ విద్యాబోధనను మరింత ఆకర్షణీయంగా మార్చిందని, పాఠశాల సమగ్ర అభివృద్ధికి ఆయన అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా ఆయన చూపిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం కూరెళ్ల శ్రీనివాసరావు దంపతులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, గ్రామ ప్రముఖులు శంకర్, పర్నే శివారెడ్డి, రంగయ్య, పల్లె సురేందర్ రెడ్డి, పోలేపల్లి ముత్తయ్య, ఎల్లయ్య, ఉపాధ్యాయులు బండి అనిల్ కుమార్ రెడ్డి, కేఆర్ మాధవ రెడ్డి, వి. అరుణ, సీహెచ్ పురుషోత్తమాచారి, వి. విజయలక్ష్మి, పి. రమేశ్ రెడ్డి, పి. దేవేందర్, పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# నేలపట్లలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో నిధుల మంజూరు
- గ్రామాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి: సర్పంచ్ వసంత నగేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** మండల పరిధిలోని నేలపట్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గంగాపురం వసంత నగేష్ గౌడ్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక సహకారంతో మంజూరైన నిధులతో మంగళవారం నేలపట్ల గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ చిన్నం బాలరాజులతో కలిసి వార్డు సభ్యులు బుట్టి స్రవంతి బాలరాజ్, దబ్బడి ఉపేందర్, పాలమాకుల కవిత నర్సింగ్‌లు ప్రారంభమైన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో అంతర్గత రహదారుల సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించారని, ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి అనేది ఏ ఒక్కరితోనో సాధ్యం కాదని, అందరూ సమిష్టిగా కృషి చేసినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండుమల్లేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ బత్తుల శంకర్, మాజీ ఉపసర్పంచ్ పాలమాకుల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పాలమాకుల నరసింహ, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కోడం రాములు, గుర్రం శ్రీనివాసులు, తడక ఆంజనేయులు, కాసోజి శంకరాచారి, గంజి సురేష్, భావనపల్లి రాజు, చౌట లింగస్వామి, భావనద్లపల్లి రమేష్, కాలనీ వాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# ధరల అదుపునకు తక్షణ చర్యలు చేపట్టాలి

- ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్యుడిపై తీవ్ర భారం: జాంగీర్
- చౌటుప్పల్‌లో వామపక్షాల నిరసన, సమావేశం
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాలకు డిమాండ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల కారణంగా సామాన్య ప్రజలపై ఆర్థిక భారం రోజురోజుకు పెరుగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి జాంగీర్ ఆరోపించారు. మంగళవారం చౌటుప్పల్ కేంద్రంలో నిర్వహించిన వామపక్షాల సమావేశం, నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎండి జాంగీర్ మాట్లాడుతూ.. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను పదేపదే పెంచడం వల్ల రవాణా వ్యయాలు భారీగా పెరిగాయని, దాని ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరిగాయని అన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించడంతో పాటు మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచేందుకు సమర్థవంతమైన నియంత్రణ చర్యలు అమలు చేయాలని కోరారు. పాలకులు ప్రజా సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాటూరు బాలరాజు, బూర్గు కృష్ణారెడ్డి, ఎండి పాషా, రాగిరి కిష్టయ్య, గంగదేవి సైదులు, కరుణాకర్, గడ్డం వెంకటేశం, తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, ఆదిమూలం నందీశ్వర్, అంతటి అశోక్, పొట్ట శ్రీనివాస్, పల్లె మధుకృష్ణ, ఎలమంచి సంజీవ్, బోదాసు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా.. ఉచిత బస్సు పాస్‌ల మేళా

- గురువారం పోచంపల్లిలో నిర్వహణ
- తడక రమేష్ జన్మదినం సందర్భంగా టి.ఆర్. యువసేన సేవా కార్యక్రమం
- అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని యువసేన అధ్యక్షుడు ప్రవీణ్ పిలుపు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** దివ్యాంగుల రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో టి.ఆర్. యువసేన ఆధ్వర్యంలో ఉచిత బస్సు పాస్‌ల మేళాను నిర్వహించనున్నట్లు యువసేన అధ్యక్షుడు వలందాస్ ప్రవీణ్ తెలిపారు. టి.ఆర్. ఫౌండేషన్ ఛైర్మన్, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ తడక రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీ గురువారం స్థానిక పద్మశాలి సభా వేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద దివ్యాంగులకు రవాణా పరంగా తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు, యాదగిరిగుట్ట డిపో మేనేజర్ సురేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన దివ్యాంగులకు ఉచిత బస్సు పాస్‌లను అందజేస్తారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మేళాకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వలందాస్ ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.

# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- 17వ వార్డులో ఘనంగా 'ఇందిరమ్మ చీరల' పంపిణీ
- వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం: కౌన్సిలర్ ఉమామహేశ్వరి సాయిలు

**తొలివెలుగు, చౌటుప్పల్:** మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చౌటుప్పల్ పురపాలక సంఘం 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, కో-ఆప్షన్ మెంబర్ పస్తం గంగరాములు అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ చీరల' పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక సహకారంతో, మున్సిపల్ ఛైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సూచనల మేరకు వార్డులోని మహిళలకు ఈ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్, కో-ఆప్షన్ మెంబర్లు మాట్లాడుతూ... మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ క్యాంటీన్లు, ఇందిరమ్మ హౌసింగ్, మహిళా శక్తి, గృహ జ్యోతి వంటి పథకాలతో పాటు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి మహిళలకు ప్రభుత్వం అండగా నిలిచిందని కొనియాడారు. ప్రతి మహిళా స్థిరమైన ఉపాధి అవకాశాలు పొందేలా ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ల సహకారంతో 17వ వార్డును అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెద్దగోని రమేష్ గౌడ్, నల్లబెల్లి కిషన్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాదాని గోపాల్, ముత్యాల మహాలక్ష్మి, మహిళా సంఘం ఆర్పీ అంతటి అలివేలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.




# కార్మికుల సంక్షేమ నిధులు మళ్లించొద్దు

- రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా
- జీవో నెం.12ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన భవన నిర్మాణ కార్మికులు




**తొలివెలుగు, రామన్నపేట:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని దెబ్బతీసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే సోములు డిమాండ్ చేశారు. మంగళవారం రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా గొరిగే సోములు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ప్రైవేటు బీమా సంస్థలకు మళ్లించేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.12ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. సంక్షేమ బోర్డు ద్వారానే అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం నేరుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సీఎస్సీ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను రద్దు చేసి, అర్హులైన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి ఉచితంగా హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవించిన కార్మికుల కుటుంబాలకు అందిస్తున్న రూ.2 లక్షల నష్టపరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లకు వెంటనే నిధులు విడుదల చేసి, లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా చెల్లింపులు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వంగాల మారయ్య, కార్యదర్శి బుడ్డ ప్రసాద్, నాయకులు నాగరాజు, జి. లింగస్వామి, బి. చెన్నయ్య, బి. మల్లయ్య, రవి, వి. రమేష్, బి. యాదగిరి, సీహెచ్ శ్రీకాంత్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక పాల సంఘం ఛైర్మన్‌గా నీల చెన్నకేశవులు

- ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన ఛైర్మన్
- శాలువాలు, పూలమాలలతో ఘన సన్మానం
- పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానన్న చెన్నకేశవులు



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని దుబ్బాక గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (పాల సంఘం) నూతన ఛైర్మన్‌గా గ్రామ ప్రముఖుడు, బీఆర్ఎస్ నాయకుడు నీల చెన్నకేశవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించగా, బీఆర్ఎస్ నాయకులు, పాడి రైతులు, గ్రామస్థులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండాల రాంబాబులు నూతన ఛైర్మన్‌ను శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు వెన్నెముకలాంటివని పేర్కొన్నారు. నూతన పాలకమండలి ఆధ్వర్యంలో దుబ్బాక పాల సంఘం మరింత అభివృద్ధి చెందడంతో పాటు పాడి రైతులకు అవసరమైన సౌకర్యాలు, ప్రోత్సాహకాలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన ఛైర్మన్ నీల చెన్నకేశవులు మాట్లాడుతూ.. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న పాడి రైతులకు, మద్దతు తెలిపిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పాల సంఘం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రతి పాడి రైతు సమస్య పరిష్కారానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆవుల శ్రీధర్, గుండాల శేఖర్, సింగారపు రమేష్, వరికుప్పల పెద్ద మైసయ్య, శాంతి కుమార్, యాదగిరి పాల్గొన్నారు.







# మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలి

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా
- వాగ్దానాలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్న దాసరి పాండు
- ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం సమర్పించిన కార్మికులు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** మున్సిపాలిటీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కార్మిక చట్టాలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి పాండు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ ఆందోళనల్లో భాగంగా మంగళవారం భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పర్సనల్ అసిస్టెంట్ (పీఏ) సంతోష్ రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పట్టణాల్లో డ్రైనేజీల శుభ్రత, రోడ్ల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పన్నులు, బిల్లుల వసూళ్లలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు కనీస కార్మిక చట్టాలు కూడా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా కనీస వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు ఏజెన్సీల విధానాన్ని రద్దు చేసి కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సంక్షేమ సదుపాయాలను కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాయ కృష్ణ, యూనియన్ జిల్లా నాయకులు రామచందర్, వెంకటేశం, బిక్షపతి, రవి, వరమ్మ, యాదమ్మ, రేణుక, కిష్టమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటాం

- ప్రమాదానికి గురైన జర్నలిస్టు అనిల్‌కు రూ.5 వేల ఆర్థిక సాయం
- బాధితుడిని పరామర్శించిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షానూర్
- జర్నలిస్టుల సంక్షేమానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ



**తొలివెలుగు, బీబీనగర్:** విధుల నిర్వహణలోనూ, ఆపద సమయంలోనూ ప్రతి జర్నలిస్టుకు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ అండగా ఉంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మొహమ్మద్ షానూర్ అన్నారు. మండల పరిధిలోని రహీంఖాన్‌గూడ గ్రామానికి చెందిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి షానూర్ పరామర్శించారు. ఈ సందర్భంగా అనిల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న షానూర్, ధైర్యం చెబుతూ అసోసియేషన్ తరపున వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిత్యం ప్రజల కోసం శ్రమించే జర్నలిస్టుల భద్రత, సంక్షేమానికి తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రమాదానికి గురైన జర్నలిస్టు అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని, మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బక్కన్న నర్సింహా, జిల్లా సభ్యుడు సంకూరి మహిపాల్ తదితరులు పాల్గొని అనిల్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# మదర్ డైరీకి పూర్వ వైభవం తెస్తాం

- బేగంపేట సొసైటీ చైర్మన్‌గా ఎడ్ల భూపాల్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక
- సభ్యులుగా పేట రాజయ్య, దూసరి రవి
- రైతులు అధికంగా పాలు పోసి సంఘాన్ని బలోపేతం చేయాలి

**తొలివెలుగు, రాజాపేట:** పాడి రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంటూ, బేగంపేట మదర్ డైరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి పూర్వ వైభవం తీసుకురావడానికి శ్రమిస్తానని నూతన చైర్మన్ ఎడ్ల భూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజాపేట మండల పరిధిలోని బేగంపేట మిల్క్ సొసైటీ ఆవరణలో ఎన్నికల అధికారి భోగ హరినాథ్ సమక్షంలో నూతన పాలకమండలి ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో చైర్మన్ పదవికి ఎడ్ల భూపాల్ రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా నూతన పాలకవర్గ సభ్యులుగా పేట రాజయ్య, దూసరి రవిలు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ రైతులకు ప్రధాన జీవనాధారంగా మారిందన్నారు. బేగంపేట పరిధిలోని పాడి రైతులందరూ ప్రైవేట్ డైరీలను నమ్మి మోసపోకుండా, మన సొంత మదర్ డైరీకే పాలు పోసి సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులందరినీ సమన్వయం చేసుకుంటూ, పాల సేకరణను పెంచి సొసైటీని లాభాల బాటలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకవర్గాన్ని ఎన్నికల అధికారి, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పరిధిలోని పాడి రైతులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్ పాల సంఘం చైర్మన్‌గా భిక్షపతి

- వరుసగా రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక
- నూతన డైరెక్టర్లుగా నలుగురు ప్రమాణ స్వీకారం
- సొసైటీ బలోపేతానికి కృషి చేయాలని గ్రామస్థుల ఆకాంక్ష



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బేగంపేట హనుమాన్ నగర్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన చైర్మన్‌గా నీలరేకుల భిక్షపతి వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో సర్వసభ్యుల ఆమోదంతో ఆయనను చైర్మన్‌గా ఖరారు చేశారు. భిక్షపతి గత పదవీకాలంలో అందించిన సేవలను గుర్తించి, సభ్యులంతా ఏకాభిప్రాయంతో ఆయనను తిరిగి ఎన్నుకున్నారు. ఇదే క్రమంలో సంఘం నూతన డైరెక్టర్లుగా జెల్ల శ్రీనివాస్, జెల్ల బాహుపేట ప్రభాకర్, గోనె పోచయ్య, చిన్నం బాలస్వామిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ భిక్షపతి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన పాడి రైతులకు, సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో సాధించిన ప్రగతిని మరికొంత ముందుకు తీసుకెళ్తామని, హనుమాన్ నగర్ సొసైటీని మండలంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పాడి రైతులకు సకాలంలో బిల్లులు అందేలా, ప్రభుత్వ రాయితీలు చేరేలా నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికైన నూతన పాలకవర్గాన్ని సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# డంపింగ్ యార్డు ఎత్తివేయాలి

**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ: జేఏసీ**

జవహర్‌నగర్, జూన్ 30: పదహారు లక్షల మంది ప్రజల ప్రాణాలతో రాంకీ చెలగాటమాడుతూ పర్యావరణ విధ్వంసం సృష్టించడం దుర్మార్గమని, వెంటనే చెత్తను తీసుకురావడం ఆపేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని డంపింగ్‌యార్డు ఎత్తివేత పోరాట జవహర్‌నగర్, దమ్మాయిగూడ జేఏసీలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్‌షావలి ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌నగర్ ప్రగతినగర్‌లోని నీలం రామచంద్రయ్యభవన్‌లో జవహర్‌నగర్, దమ్మాయిగూడ జేఏసీల సమావేశాన్ని నిర్వహించారు. షేక్‌షావలి మాట్లాడుతూ డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న చెత్తను బయోమైనింగ్‌ను ప్రారంభించాలని, మురుగునీటి ప్రవాహాన్ని అడ్డుకుని బాధిత ప్రజలకు ఉచితంగా తాగునీటి, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. జీహెచ్ఎంసీ తక్షణమే ప్రత్యామ్నాయ సైట్లను ఏర్పాటు చేసి జవహర్‌నగర్‌కు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌నారాయణ, మాజీ కార్పొరేటర్లు లలితాయాదవ్, వేణు, చిత్రసుబ్రహ్మణ్యం, సమ్మిరెడ్డి, మీరా, శివబాబు, నర్సింహగౌడ్, శంకర్, శివన్నారాయణ, ప్రవీణ్, చంద్రన్న, యాకస్వామి, పాషామియా, సునీత, అనంతలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

**కూకట్ పల్లి, తొలివెలుగు,:** భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో లో కూకట్ పల్లి లో నిరసన అనంతరం కూకట్ పల్లి తహసిల్దార్ కార్యాలయం లో డిప్యూటీ తాసిల్దార్ జ్యోతి కీ సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ మూడు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 12ను జూలై తేది: 22-07-2025న విడుదల చేసింది. జీఓ విడుదల చేసిన వెంటనే ట్రెయిల్ బ్లెజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు బదిలీ చేశారు. కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేని సిఎసి సి హెల్త్ టెస్టులు చేస్తూ రూ.750 కోట్లకు పైగా ఆ సంస్థకు ఇచ్చి వెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులు దుబారా చేశారు. కేంద్ర చట్టం, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు, సిఎస్సి సంస్థకు వందల కోట్లు కట్టబెట్టడం దుర్మార్గం అని అన్నారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులను ఖర్చు చేయాలి. కానీ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించకుండా ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి పేద నిర్మాణ కార్మికుల నోట్లో మట్టిగొడుతున్నారు.



రాష్ట్రవ్యాప్తంగా 2009 నుండి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 28 లక్షల 50 వేల మంది ఉండగా, 16 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి ఒక్కొక్క కార్మికుడికి ప్రీమియం రూ.2,309/- ల చొప్పున 15 లక్షల మంది కార్మికులకు రూ.346.36 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టారు. 2025 జూలై 24 నుండి ఇప్పటివరకు ఇన్సూరెన్స్ కంపెనీ వారు కార్మికులకు చెల్లించిన నష్టపరిహారాలు రూ.140 కోట్లు మాత్రమే. సుమారు రూ.200 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు మిగిల్చారు. బోర్డు నుండి డేటా ఇవ్వలేదని సాకు చూపి వేలాది మంది కార్మికులకు నష్టపరిహారాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొని వందల కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు దోచుకున్నాయి. 13 లక్షలకు పైగా కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా వారికి అన్యాయం చేస్తున్నారు. వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చుల వంటి తదితర స్కీములను ప్రభుత్వం, బోర్డు అధికారులు అనేక కారణాలు చూపి కార్మికులకు అందకుండా చేస్తున్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాలకు నిధులు సకాలంలో విడుదల చేయకుండా, కొత్త సంక్షేమ పథకాలు పెట్టకుండా ప్రభుత్వం బోర్డు నిధులను దుబారా చేస్తున్నది. కావున ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రద్దు చెయ్యాలి కార్మికుల ను ఆదుకోవాలి వారికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి, సహజ మరణ కార్మికులకు 5లక్ష లు వెల్ఫేర్ బోర్డు నుండి ఇవ్వాలి అని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో భవన నిర్మాణ సంఘం, కూకట్ పల్లి మండల కార్యదర్శి బి. రాములు, సమ్మయ్య, మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాలో జీతాల్లేవ్

**ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు**

జీహెచ్ఎంసీలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురొంటున్నారు. హెల్త్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వెంటనే జీతాలు చెల్లించాలంటూ గతంలోనే సీఎంఓహెచ్ (చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ )జోనల్ కార్యాలయం నుంచి అన్ని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలకు స్పష్టమైన సర్క్యులర్ జారీచేశారు. ఐతే ఈ సర్క్యులర్‌ను సదరు 'కోన' ఏజెన్సీ ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు ఆదేశాలు ఇచ్చినా ఏజెన్సీ మొండివైఖరి వీడకపోవడంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్ నుంచి ఎక్స్‌టెన్షన్ (గడువు పెంపు) ఆర్డర్ తెచ్చి ఇచ్చాం. అయినా సరే, మళ్లీ కమిషనర్ నుంచే కొత్తగా ఎక్స్‌టెన్షన్ తేవాలంటూ ఏజెన్సీ నిర్వాహకులు మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి కమిషనర్ నుంచి అనుమతి తెచ్చినప్పటికీ, ఏజెన్సీ యాజమాన్యం కావాలనే కొత్త సాకులు వెతుకుతూ కాలయాపన చేస్తోందని సిబ్బంది వాపోతున్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తూ, తమ పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా బల్దియా సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమపై ఏజెన్సీ నిర్వాహకులు కక్షసాధింపు ధోరణి వీడాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.




# ముత్యాలమ్మగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

కట్టంగూర్, జూన్ 30 : నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజాము ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భీమవరం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇంటర్‌సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా టైర్ పేలింది. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న సిమెంట్ లారీని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, లారీ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. అయితే బస్సులో ఉన్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయట పడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. కట్టంగూర్ 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ సమీర్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి, ప్రమాదానికి సంబంధించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అధికారుల తప్పిదం.. రోడ్డున పడ్డ నిరుపేద కుటుంబం

తుంగతుర్తి, జూన్ 30 : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి చెందిన జలగం మమతకు జూలై 2025లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ చేతుల మీదుగా మంజూరు పత్రం అందజేశారు. అనంతరం అధికారులు ఆన్‌లైన్ చేసి ఇంటి నిర్మాణానికి ముగ్గు వేయడంతో లబ్ధిదారులు అప్పు తెచ్చి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టి బేస్‌మెంట్ పనులు పూర్తి చేసింది. మొదటి విడుత బిల్లు కోసం అధికారులను సంప్రదించగా మీ పేరున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఐడీ నంబర్ తప్పుగా పడిందని మీకు బిల్లు రాదని మీరు పై అధికారులను కలవాలని చెప్పారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తాము కూలి పని చేసుకుని జీవనం సాగిస్తామని, అధికారులు చేసిన పొరపాటు వల్ల తమ కుటుంబం నడి రోడ్డున పడిందని లబ్ధిదారులు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే, సూర్యాపేట జిల్లా కలెక్టర్ స్పందించి తప్పు చేసిన అధికారులపై చర్య తీసుకుని తమకు ఇల్లు మంజూరు చేసి న్యాయం చేయాలని వేడుకున్నారు.

# విద్యుత్ నెట్‌వర్క్ మ్యాపింగ్ డ్రైవ్

విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విద్యుత్ అంతరాయాలను వేగంగా గుర్తించడం, వినియోగదారులకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా టీజీఎస్‌పీడీసీఎల్ జూలై 1 నుంచి తన పరిధి వ్యాప్తంగా సమగ్ర విద్యుత్ నెట్‌వర్క్ మ్యాపింగ్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నదని దక్షిణ డిస్కం సీఎండీ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. తొలిదశలో ఈ కార్యక్రమాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో అమలు చేయనున్నామని, దీని ద్వారా 132/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ల నుంచి 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు ప్రతీ వినియోగదారుడి సర్వీస్ కనెక్షన్ వరకు పూర్తిగా విద్యుత్ నెట్‌వర్క్ అనుసంధానాన్ని డిజిటల్ రూపంలో ఖచ్చితంగా నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వినియోగదారుల సర్వీసులు, సంబంధిత డీటీఆర్‌లు, ఫీడర్ల మధ్య అనుసంధాన వివరాలు పూర్తిస్థాయిలో డిజిటల్ మ్యాపింగ్ కాలేదని, ఈ కార్యక్రమం ద్వారా ఆ లోటును పూర్తిగా తొలగించి, విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునీకీకరిస్తామని ఆయన తెలిపారు. ఈ మ్యాపింగ్ పూర్తయిన తర్వాత ఒక వినియోగదారుడి ఇంటికి విద్యుత్ ఏ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నుంచి, ఏ 33కేవీ ఫీడర్ ద్వారా, ఏ 11కేవీ ఫీడర్ ద్వారా, ఏ డీటీఆర్ ద్వారా చేరుతుందనే పూర్తి సమాచారం ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉంటుందని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా ఫీల్డ్ ఇంజనీర్లు ప్రతీ 11కేవీ ఫీడర్‌కు అనుసంధానమైన డీటీఆర్‌ల స్ట్రక్చర్ కోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ధృవీకరిస్తారన్నారు. జూలై నెల బిల్లింగ్ ప్రక్రియలో మీటర్ రీడర్లు ప్రతీ డీటీఆర్‌ను సందర్శించి ఆయా ట్రాన్స్‌పార్మర్లకు అనుసంధానమైన వినియోగదారుల సర్వీసులను ఖచ్చితంగా మ్యాపింగ్ చేస్తారని జితేశ్ పాటిల్ చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి కారణాలు, పునరుద్ధరణకు పట్టే సమయం వంటి వివరాలను వినియోగదారులకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సాంకేతికత, డిజిటలైజేషన్‌ను విస్తృతంగా వినియోగించడం ద్వారా వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శకమైన, నమ్మకమైన సేవలను అందించడమే లక్ష్యమని సీఎండీ జితేశ్ పాటిల్ తెలిపారు.



# తక్కువ ఖర్చుతో ఇల్లు కట్టాలనుకుంటే.. ఇదే సరైన ఐడియా, ట్రెండ్ కూడా

ఇల్లు కట్టాలంటే ఇటుకలు తప్పకుండా ఉపయోగించాలి. అంతే కాదు ఇటుకలకు తోడుగా సిమెంట్, కాంక్రీట్ వాటిని గోడలు కట్టడం కోసం ఎక్కువగా ఉపయోగించాల్సి ఉంటుంది. కాని మారుతున్న కాలానికి అనుగూణంగా టెక్నాలజీని ఉపయోగించి ఖర్చు తక్కువతో ఇల్లు కట్టేందుకు ఇంటర్ లాక్ ఇటుకలు బెస్ట్ ఆప్షన్‌గా మారాయి. ఇల్లు కట్టడం అనేది ఇప్పుడు ఒక మంచి ట్రెండ్ అవుతోంది. సాధారణ ఇటుకలతో పోలిస్తే వీటి వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. సిమెంటు వాడకం తక్కువ ఈ ఇటుకలు ఒకదానికొకటి లాక్ అయ్యేలా ఉంటాయి కాబట్టి గోడలు కట్టేటప్పుడు వరుసల మధ్య సిమెంటు మిశ్రమం వాడాల్సిన అవసరం ఉండదు. కేవలం పునాది, పిల్లర్లు పైన బీమ్స్ దగ్గర మాత్రమే సిమెంటు వాడతారు.ప్లాస్టరింగ్ అవసరం లేదు ఈ ఇటుకలు చూడటానికి చాలా ఫినిషింగ్‌తో ఉంటాయి. కాబట్టి గోడలకు ప్లాస్టరింగ్ చేయకుండానే నేరుగా పెయింట్ వేసుకోవచ్చు. దీనివల్ల ఖర్చు బాగా తగ్గుతుంది. దీనికి సంబంధించి మేస్త్రి నాగేష్ లోకల్ 18తో మరికొన్ని వివరాలు షేర్ చేసుకున్నారు. ఇల్లు కట్టాలంటే ఇటుకలు తప్పకుండా ఉపయోగించాలి. అంతే కాదు ఇటుకలకు తోడుగా సిమెంట్, కాంక్రీట్ వాటిని గోడలు కట్టడం కోసం ఎక్కువగా ఉపయోగించాల్సి ఉంటుంది. కాని మారుతున్న కాలానికి అనుగూణంగా టెక్నాలజీని ఉపయోగించి ఖర్చు తక్కువతో ఇల్లు



కట్టేందుకు ఇంటర్ లాక్ ఇటుకలు బెస్ట్ ఆప్షన్‌గా మారాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరి వాసి నాగేష్ మాట్లాడుతూ ఈ ఇటుకలు ప్రస్తుతానికి చాలా గట్టిగానే ఉన్నాయని.. వర్షం, ఎండకు అన్నిటికి తట్టుకునే స్థాయిలో వీటిని తయారు చేస్తున్నట్లుగా వివరించారు. అయితే ఈ ఇంటర్లాక్ ఇటుకుల వల్ల మామూలుగా నిర్మించుకునే ఇటుకల కంటే ఈ ఇటుకులతో నిర్మాణ సమయం ఆదా మామూలు ఇటుకలతో పోలిస్తే ఈ ఇటుకలతో గోడలు చాలా వేగంగా కట్టవచ్చు. ఖర్చు తగ్గుతుంది. ప్లాస్టరింగ్ సిమెంటు ఖర్చులు తగ్గడం వల్ల మొత్తం నిర్మాణ వ్యయంలో 20% నుండి 30% వరకు ఆదా అయ్యే అవకాశం ఉందంటున్నారు. 10 ఏళ్లలో ఎప్పుడూ లేనిది ఇప్పుడే ఎందుకు ఇలా? ఉద్యోగుల్లో మళ్లీ కరోనా టైమ్‌లోని టెన్షన్, నిర్మలా సీతారామన్‌కు లేఖ! బ్రతికున్నప్పుడు అప్పులు.. చనిపోయాక కోటీశ్వరుడు.. మైఖేల్ జాక్సన్ చివరి రోజులు నరకం.. ఇప్పుడు ఆయన ఆస్తిని ఎవరు అనుభవిస్తున్నారో తెలుసా? 'మిర్చీ' సినిమా విలన్ గుర్తున్నాడా?.. ఆయన భార్య తెలుగులో తోపు హీరోయిన్.. పవన్ కళ్యాణ్‌తో డిజాస్టర్ సినిమా చేసింది..! బంగారంపై గోల్డ్ లోన్ తీసుకునే వారికి ఎగిరి గంతేసే భారీ శుభవార్త.. ఏటీఎంకు వెళ్లి 20 నిమిషాల్లోనే అకౌంట్‌లోకి డబ్బులు పొందండి! అంతే కాదు ఈ ఇటుకల తయారీలో వాడే పదార్థాల వల్ల ఇల్లు వేసవిలో చల్లగా ఉంటుంది. పర్యావరణ హితం వీటిని కాల్చాల్సిన అవసరం ఉండదు (ఎఱఅస్త్రప్ల-జూతీవంంబతీవ ఎశీఎజూతీవంంఱశీఅ). కాబట్టి కాలుష్యం ఉండదు. అయితే గమనించవలసిన జాగ్రత్తలు ఏమిటంటే నిపుణులైన మేస్త్రీలు ఈ ఇటుకలతో ఇల్లు కట్టడం కొంచెం భిన్నంగా ఉంటుంది. కాబట్టి దీనిపై అవగాహన ఉన్న మేస్త్రీలనే ఎంచుకోవాలి.నాణ్యత పరీక్ష ఇటుకలు కొనేటప్పుడు అవి సరిగ్గా లాక్ అవుతున్నాయా లేదా వాటి గట్టిదనాన్ని (ర్‌ీతీవఅస్త్రప్త) సరిచూసుకోవాలి.

## మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అద్భుత అవకాశం...



డిజిటల్ ప్రపంచంలో మహిళలకు కొత్త అవకాశాలు ఎలా తెరుచుకుంటున్నాయో చూపించే మంచి ఉదాహరణ వుమెనియా కార్యక్రమం. ఇది మహిళలు తమ ప్రతిభను పెద్ద మార్కెట్‌లో చూపించుకునే మార్గాన్ని సులభం చేస్తోంది. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అద్భుత అవకాశం... ఇప్పటికే 2.1 లక్షల మంది చేరారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అద్భుత అవకాశం... ఇప్పటికే 2.1 లక్షల మంది చేరారు వుమెనియా అనే ఇనిషియేటివ్ ద్వారా మహిళా ఎంట్రప్రెన్యూర్స్, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (ఎస్‌హెచ్‌జీస్) తమ ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలుదారులకు నేరుగా అమ్మగలుగుతున్నారు. ఇది జిఈఎం ప్లాట్‌ఫామ్ ద్వారా జరుగుతుంది. ఇందులో హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్, జ్యూట్, కాయిర్, హోమ్ డెకోర్, ఆఫీస్ ఫర్నిషింగ్స్ వంటి విభాగాలు ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2.1 లక్షల మహిళ ఎంఎస్ఈలు జిఈఎంలో నమోదు అయ్యి, 13.7 లక్షల ఆర్డర్లు సాధించారు. ప్రభుత్వ ఈ మార్కెట్‌ప్లేస్ (జిఈఎం) అనేది ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్. ఇందులో సెంట్రల్, స్టేట్ మినిస్ట్రీలు, డిపార్ట్‌మెంట్లు, ఆర్గనైజేషన్స్, పబ్లిక్ సెక్టార్ యూనిట్స్, పంచాయతీలు, కోఆపరేటివ్స్ తమ అవసరాల కోసం వస్తువులు, సేవలు కొనుగోలు చేస్తాయి. 2016లో "మినిమమ్ గవర్నమెంట్, మాక్సిమమ్ గవర్నెన్స్" అనే విజన్‌తో ఇది ప్రారంభమైంది. ఇది పేపర్‌లెస్, క్యాష్‌లెస్, కాంటాక్ట్‌లెస్ విధానంలో పనిచేస్తుంది. దేశమంతటా ఉన్న విక్రేతల నుంచి నేరుగా కొనుగోలు చేయడం సులభమైంది. భారతదేశంలో పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ ఒక పెద్ద మార్కెట్. జిఈఎం ద్వారా డిజిటల్ కొనుగోళ్లు పెరగడంతో పారదర్శకత పెరిగింది.

## రైలు ప్రయాణికులకు బ్యాడ్ న్యూస్!



రైలు ప్రయాణికులకు బ్యాడ్ న్యూస్! ఏప్రిల్ 28 నుండి ఈ రైళ్లు బంద్.. మీ టికెట్ క్యాన్సిల్ అయిందేమో చూసుకోండి! ట్రైన్స్, రైళ్లు, దక్షిణ మధ్య రైల్వేస్, రైల్వేస్, రైలు, ట్రైన్ క్యాన్సిల్ రైలు ప్రయాణికులకు చేదువార్త! విజయవాడ డివిజన్ పరిధిలోని రాయనపాడు యార్డ్ రీమోడలింగ్ పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే భారీ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 28 నుండి మే 5 వరకు పలు కీలక రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారిక ప్రకటన విడుదల చేసింది. మీరు ఈ తేదీల్లో ప్రయాణం ప్లాన్ చేసుకుంటున్నారా? అయితే ఏ రైళ్లు రద్దు అయ్యాయో, ఆ వివరాలేంటో ఇప్పుడే తెలుసుకోండి! ట్రైన్స్, రైళ్లు, దక్షిణ మధ్య రైల్వేస్, రైల్వేస్, రైలు, ట్రైన్ క్యాన్సిల్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ -- దువ్వాడ సెక్షన్‌లో రాయనపాడు యార్డ్ రీమోడలింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా రైళ్ల రాకపోకలకు ఆటంకం కలగనుంది. ప్రయాణికుల భద్రత, రైల్వే వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా ఈ పనులను అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ట్రైన్స్, రైళ్లు, దక్షిణ మధ్య రైల్వేస్, రైల్వేస్, రైలు, ట్రైన్ క్యాన్సిల్ రద్దు చేసిన రైళ్లలో విజయవాడ నుండి సికింద్రాబాద్, గుంటూరు, భద్రాచలం వంటి ప్రధాన నగరాలకు వెళ్లే సర్వీసులు ఉన్నాయి.

## ఫ్లిప్‌కార్ట్ భారీ శుభవార్త.. కస్టమర్లకు రూ.10 లక్షల లోన్!






మీ ఫోన్‌లో ఫ్లిప్‌కార్ట్ యాప్ ఉందా? అయితే మీకు గుడ్ న్యూస్. మీరు ఏకంగా రూ. 10 లక్షల వరకు లోన్ పొందొచ్చు. ఎలానో తెలుసుకోండి. మీరు లోన్ తీసుకోవాలని అనుకుంటున్నారా? అయితే గుడ్ న్యూస్. మీ ఫోన్‌లో ఫ్లిప్‌కార్ట్ ఉంటే చాలు.. ఏకంగా రూ.10 లక్షల వరకు లోన్ పొందొచ్చు. ఎలా అని అనుకుంటున్నారా? అయితే ఈ వివరాలు తెలుసుకోవాల్సిందే. ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ కేవలం వస్తువుల విక్రయానికే, ఆన్‌లైన్ షాపింగ్‌కు మాత్రమే పరిమితం కాకుండా, ఇప్పుడు తన వినియోగదారులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కూడా సిద్ధమైంది. పలు ఫైనాన్స్ కంపెనీలతో కలిసి ఫ్లిప్‌కార్ట్ రూ. 10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలను (ఔవతీంశీఅఖ్రీ ాశ్రీఱఅం) అందిస్తోంది. అత్యవసర ఆర్థిక అవసరాల కోసం బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, యాప్ ద్వారానే ఈ రుణం పొందే వెసులుబాటు ఉండటం విశేషం. ఇక్కడ ఫ్లిప్‌కార్ట్ నేరుగా రుణాలు ఇవ్వదు. ఇది మీడియేటర్ మాత్రమే. ఫైనాన్స్ కంపెనీలు లేదా బ్యాంకులు రుణాలు ఇస్తాయి. డబ్బు, లోన్, ఫ్లిప్‌కార్ట్, సూపర్ క్యాష్, పర్సనల్ లోన్ ఫ్లిప్‌కార్ట్ యాప్‌లోని సమాచారంప ప్రకారం.. ఈ పర్సనల్ లోన్ కేవలం నిమిషాల వ్యవధిలోనే ఆమోదం పొందుతుంది. అర్హత కలిగిన వినియోగదారులకు గరిష్టంగా రూ. 10 లక్షల వరకు లోన్ ఇచ్చేలా ఎల్అండ్‌టీ ఫైనాన్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఎటువంటి ఫిజికల్ డాక్యుమెంటేషన్ లేకుండా, పూర్తి డిజిటల్ ప్రక్రియ ద్వారా ఈ రుణాన్ని పొందవచ్చు. ఇది ముఖ్యంగా జీతం పొందే ఉద్యోగులకు , ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ సేవలను వాడుతున్న వారికి మంచి అవకాశం. ఫ్లిప్‌కార్ట్ నుంచి పర్సనల్ లోన్ ఎలా పొందాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీరు ముందుగా ఫ్లిప్‌కార్ట్ యాప్‌లోకి వెళ్లాలి. అక్కడ కింద అకౌంట్ అనే ఆప్షన్ ఎంచుకోవాల్షి. ఆ తర్వాత మీకు ఫైనాన్స్ ఆప్షన్స్ కనిపిస్తాయి. ఇందులో ప్రిఅప్రూవ్డ్ సూపర్ క్యాష్ బ్యాలెన్స్ అనే ఆప్షన్ ఉంటుంది. దీనిపై క్లిక్ చేయాలి. ఇప్పుడు రూ.10 లక్షల వరకు లోన్ పొందొచ్చనే ఆప్షన్ మీకు కనిపిస్తుంది. ఇందులో మీరు మూడు స్టెప్‌లు పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదటగా మీ వివరాలను అందించాల్సి ఉంటుంది. పేరు, పాన్ కార్డు వంటి వివరాలు ఇవ్వాలి. తర్వాత మీ లోన్ అర్హత అనేది తెలుస్తుంది. మీకు ఎలిజిబిలిటీ ఉంటే.. ఎంత వరకు లోన్ పొందొచ్చొ మీకు కనిపిస్తుంది. లేదంటే లేదు. మీకు అర్హత వస్తే.. ఎంత మొత్తం లోన్ పొందాలని అనుకుంటున్నారో.. సెలెక్ట్ చేసుకోవాలి. తర్వాత ప్రొసీడ్ కొట్టాలి. ఇప్పుడు మీకు ఈఎంఐ ఆప్షన్లు కనిపిస్తాయి. మీకు నచ్చిన టెన్యూర్, ఈఎంఐ ఆప్షన్ ఎంచుకోవచ్చు. తర్వాత ఓకే చేయాలి. 5/7

**డబ్బు, లోన్, ఫ్లిప్‌కార్ట్, సూపర్ క్యాష్, పర్సనల్ లోన్**

ఇక చివరి స్టెప్. ఇక్కడ మీరు లోన్ ఈఎంఐ ఆటోమెటిక్‌గా కట్ అవ్వడానికి మీ బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు కట్ చేసుకునేందుకు ఫైనాన్స్ కంపెనీకి అనుమతి ఇవ్వాలి. డెబిట్ కార్డు అవసరం అవుతుంది. ఈ ప్రాసెస్ పూర్తి చేస్తే తర్వాత మీ అకౌంట్‌లోకి డబ్బులు జమ అవుతాయి. ఇలా మీరు సులభంగానే లోన్ పొందొచ్చు. డబ్బు, లోన్, ఫ్లిప్‌కార్ట్, సూపర్ క్యాష్, పర్సనల్ లోన్ రుణ రేట్ల విషయానికి వస్తే, ఫ్లిప్‌కార్ట్ లోన్లపై వడ్డీ సుమారు 9.99 శాతం నుండి ప్రారంభమవుతుంది. మీ క్రెడిట్ హిస్టరీ , ఆదాయాన్ని బట్టి ఈ రుణ రేటు 22 శాతం వరకు మారవచ్చు. లోన్ తిరిగి చెల్లించడానికి 7 నెలల వరకు గడువును (ువఅబతీవ) ఎంచుకోవచ్చు. దీనివల్ల నెలకు కట్టే ఈఎంఐ భారం కూడా తక్కువగా ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు కూడా లోన్ మొత్తంలో 2 శాతం వరకు ఉండొచ్చు. డబ్బు, లోన్, ఫ్లిప్‌కార్ట్, సూపర్ క్యాష్, పర్సనల్ లోన్ పెళ్లిళ్లు, వైద్య ఖర్చులు, ఇంటి మరమ్మతులు లేదా విద్యా అవసరాల కోసం అత్యవసరంగా డబ్బు కావాలనుకునే వారికి ఫ్లిప్‌కార్ట్ రూ. 10 లక్షల లోన్ ఒక మంచి ఎంపిక. అయితే లోన్ తీసుకునే ముందు వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజు , ఇతర షరతులను జాగ్రత్తగా చదవాలి. సకాలంలో ఈఎంఐలు చెల్లిస్తే మీ సిబిల్ స్కోర్ పెరిగి, భవిష్యత్తులో మరింత ఎక్కువ లోన్ పొందే అవకాశం ఉంటుంది.

## అంతుచిక్కని బంగారం ధరలు... రాత్రికి రాత్రే ఎందుకీ మార్పు?



బంగారం ధరల ట్రెండ్ అస్సలు అంతుచిక్కట్లేదు. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి. పెరిగితే భారీగా పెరుగుతున్నాయి. తగ్గితే అంతే భారీగా తగ్గుతున్నాయి. దీంతో బంగారం ధర ఎటువైపు పయనిస్తుందో పసిగట్టలేకపోతున్నారు. వచ్చేవారమే అక్షయతృ ఎవ్వర్రా మీరు ఇంత చిల్లరగా ఉన్నారు..! కార్లతో కొట్టుకున్న స్నేహితుల అచ్చం భారీ బడ్జెట్ యాక్షన్ సినిమా క్లైమాక్స్‌ను తలపించేలా జరిగిన ఓ భయంకరమైన ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. 40ఏళ్ల వనవాసం తర్వాత ఇంటికి మావోయిస్టు అగ్రనేత.. అన్న అంటూ జనం ఆత్మీయ స్వాగతం 40 సంవత్సర తర్వాత స్వగ్రామానికి చేరుకున్న మాజీ మావోయిస్టు దేవ్ జీ(తిపిరి తిరుపతి)కిఘన స్వాగతం పలికారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు. ఒకప్పుడు కలిసే ఉన్న ఈ జిల్లా ఇప్పుడు జగిత్యాల జిల్లాగా విభజించబడింది. ఈ జిల్లాలోని కోరుట్లలో భావోద్వేగ దృశ్యాలు చోటుచేసుకున్నాయి. ఎవరా వ్యక్తి నర్సింగ్ విద్యార్థినిపై అత్యాచారం.. గ్యాంగ్ రేప్ చేసి చివరికి ఆ అమ్మాయిని ఏం చేశారో తెలుసా.. వరంగల్ రాయపర్తి గిరిజన తండాలో 21 ఏళ్ల యువతి సామూహిక అత్యాచారం అనంతరం అనుమానాస్పద మృతి, కుటుంబం ఆత్మహత్య కాదని ఆరోపణలు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం భారీగా తగ్గనున్న గ్యాస్ సిలిండర్ ధర.. మోదీ ప్లాన్ అదిరింది.. ఏకంగా రూ. రూ. 317 ధమాల్.. ఎల్పీజీ, పీఎన్‌జీలపై పన్నులను తొలగించాలని కోరుతూ వాణిజ్య, పారిశ్రామిక మండలి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసింది. పన్నును తొలగిస్తే గ్యాస్ ధరలు తగ్గి, సామాన్యులకు బిగ్ రిలీఫ్ ఉంటుందని ఆ సంస్థ పేర్కొంది. యుద్ధం ఆగింది.. సీజ్ ఫైర్ ముందు అసలేం జరిగింది ? బాబోయ్.. మాకొద్దు బంగారం అంటున్న మహిళలు.. రేటు పెరిగినందుకు కాదు.. అసలు కారణం ఇదే! ఎంత బంగారం ఉన్న మహిళలకు ఇంకా బంగారం కొనాలని ఉంటుంది. బంగారం కొనిస్తామని భర్తలు అంటున్న వద్దంటున్నారు. కారణం బంగారం రేటు పెరగడం కాదంట. ఎందుకు మహిళలు బంగారం వద్దంటున్నారో తెలుసుకుందాం. మరణించిన వారికి జీతాలు! కరీంనగర్ పోలీస్ శాఖలో రూ. 1.40 కోట్ల భారీ కుంభకోణం.. వెలుగులోకి షాకింగ్ నిజాలు! మరణించిన సహోద్యోగుల పేరుతో గత నాలుగేళ్లుగా ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్న వైనం వెలుగులోకి రావడంతో పోలీస్ శాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇవాళ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న అప్‌డేట్స్,